www.epapersamayam.com
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 సంచిక : 204 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 03 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

## ఇరాన్ లక్ష్యంగా బి2 బాంబర్లు!

- డీగో గార్సియా దీవిలో ఆరింటిని మోహరించిన అమెరికా



**సమయం న్యూస్, దుబాయ్:** ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరు గుతున్న వేళ హిందూ మహాసముద్రంలోని డీగో గార్సియా ద్వీపంలో శత్రుభీకర బి2 బాంబర్ల మోహరింపును అమెరికా పెంచుతోంది. ఆ దీవిలో ప్రస్తుతం కనీసం ఆరు బి2 బాంబర్లు ఉన్నట్లు తాజాగా ఉపగ్రహ చిత్రాల విశ్లేషణతో స్పష్టమవుతోంది. ఈ సంఖ్య గత వారంతో పోలిస్తే ఎక్కువ కావడం గమనార్హం. యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదారులపై అమెరికా చాన్నాళ్లుగా

తరువాయి 2లో

## వక్ఫ్ బిల్లుకు
# లోక్‌సభ ఆమోదం

- అనుకూలంగా 288... వ్యతిరేకంగా 232 ఓట్లు
- 14 గంటలకు పైగా సుదీర్ఘ సమావేశం
- తెల్లవారుజాము వరకూ చర్చ
- విమర్శలు, ప్రతి విమర్శలతో మార్మోగిన సభ
- ప్రభుత్వంపై ఆరోపణలను తిప్పికొట్టిన రిజిజు, అమిత్ షా
- మైనారిటీల హక్కులను హరిస్తున్నారని ప్రతిపక్షాల ధ్వజం

2లో





## 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్లు
# తితిదేను తీర్చిదిద్దాలి

- సేవల్లో 100% మార్పు కనిపించాలి
- ఇష్టారీతిన డబ్బులు ఖర్చుపెట్టొద్దు
- సమీక్షలో సీఎం చంద్రబాబు

**సమయం న్యూస్, అమరావతి:** తిరుమలకు భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేప థ్యంలో.. వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా తితిదేను తీర్చిదిద్దాలని.. భక్తులకు అందించే సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అవసరమైన పనులు మాత్రమే చేయాలని, శ్రీవారి సొమ్మును ఇష్టారీతిన ఖర్చుపెట్టొద్దని స్పష్టం చేశారు. మనం ధర్మకర్తలం, నిమిత్తమాత్రులమేనని.. స్వామివారికి భక్తులు కానుకల రూపంలో ఇచ్చే డబ్బును ఇష్టారీతిన ఖర్చు పెట్టే అధికారం ఎవరికీ లేదని తేల్చిచెప్పారు. తిరుమల

తరువాయి 2లో



## వరంగల్ చపాటా మిర్చికి
# భౌగోళిక గుర్తింపు

- మందం, ప్రకాశవంతమైన రంగుతో ప్రత్యేకత

**సమయం న్యూస్, హైదరాబాద్:** వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు (జీఐ) లభించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ జియోగ్రాఫికల్ ఇండికేషన్

తరువాయి 2లో

## భారత్‌పై
# ప్రతీకార సుంకం 26%

- ప్రతి దేశంపై కనీసం 10% సుంకం
- ఇప్పటికీ ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌ల్లో సగమే వేస్తున్నాం
- అర్ధరాత్రి నుంచి అమల్లోకి
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

2లో






## 42% రిజర్వేషన్లకు
# సై అనకుంటే ధర్మయుద్ధమే

- డిమాండ్లకు మోదీ దిగైనా రావాలి.. గద్దె దిగైనా పోవాలి
- రాష్ట్రంలో అమలు చేసుకుంటే ప్రధానికేం ఇబ్బంది?
- ఢిల్లీ జంతర్‌మంతర్ మహాధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



# సంప్రదాయమే శాసనమై!

* మూడోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలను నిరాకరిస్తూ రాజ్యాంగ సవరణ
* రూజ్‌వెల్ట్ ఒక్కరే నాలుగుసార్లు ఎన్నిక
* ఆ తర్వాత కొత్త నిబంధన
* అంతకు ముందు రెండు సార్ల సంప్రదాయాన్ని కొనసాగించిన అధ్యక్షులు

2లో

## మీ మంత్రివర్గంలో
## 46 శాతం బీసీలు ఉన్నారా?

- 42 శాతం రిజర్వేషన్ల అమలు నుంచి తప్పించుకోవడానికే ధర్నా
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

2లో





## ప్రాజెక్టులు అడ్డుకుంటే..
# రెడ్‌బుక్‌లోకి పేరు

- వైకాపా వాళ్లు పనిచేయరు.. చేయనివ్వరు
- పీ-4కు బయోగ్యాస్ ప్లాంట్ తొలి అడుగు
- ఐదేళ్లలో 25 లక్షల ఉద్యోగాలే లక్ష్యం
- సీబీజీ ప్లాంట్ భూమి పూజలో మంత్రి లోకేశ్

2లో

## వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు

**(మొదటిపేజీ తరువాయి)**

రిజిస్ట్రీ నుంచి బుధవారం ధ్రువీకరణ పత్రం అందిందని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ) దండా రాజిరెడ్డి తెలిపారు. పలు ప్రత్యేకతలు ఉన్న వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు కోసం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘం, మహబూబాబాద్ జిల్లా మల్యాలలోని ఉద్యాన పరిశోధన కేంద్రం, కొండా లక్ష్మణ్ వర్సిటీ.. జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీకి దరఖాస్తులు సమర్పించాయి. వీటిపై అధ్యయనం చేసిన రిజిస్ట్రీ తాజాగా భౌగోళిక గుర్తింపునకు ఆమోద ముద్ర వేస్తూ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసింది. వరంగల్ చపాటా మిరపకాయ పండ్లు లావుగా, ప్రకాశవంతమైన ఎరుపు రంగులో ఉంటాయి. కొద్దిగా టమాటా ఆకారంలో ఉండే వీటిని 'టమాటా మిరపకాయ' అని కూడా పిలుస్తున్నారు. తక్కువ ఘాటుతో రుచికరంగా, శుద్ధికి, ఎగుమతికి అనువుగా ఉంటాయి. పచ్చళ్లకు చపాటా మిర్చి పొడిని అధికంగా వాడుతుంటారు. మిఠాయిలతోపాటు ఆహార, సౌందర్య సాధనాలు, పానీయాలు, ఔషధ, వస్త్ర పరిశ్రమల్లోనూ చపాటా మిర్చిని రంగుగా ఉపయోగిస్తున్నారు. స్థానిక నేలలు, వాతావరణ అనుకూలతల వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఈ పంట ఎక్కువగా సాగవుతోంది. ఇక్కడ 20 వేల మందికి పైగా రైతులు ఏటా దాదాపు 7 వేల ఎకరాల్లో 10 వేల టన్నులకు పైగా ఉత్పత్తి చేస్తున్నారు. భౌగోళిక గుర్తింపు లభించడం ద్వారా వరంగల్ చపాటా మిర్చి పంటకు డిమాండ్ పెరిగి ప్రపంచవ్యాప్తంగా విశేష ఖ్యాతి లభించనుందని ఉద్యాన వర్సిటీ వీసీ దండా రాజిరెడ్డి తెలిపారు. చపాటా మిర్చి సాగుచేసే రైతులకు భౌగోళిక గుర్తింపు ద్వారా ఎన్నో ప్రయోజనాలు దక్కనున్నాయని మల్యాలలోని ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త కె.భాస్కర్ వివరించారు. జీఐ కారణంగా చపాటా మిరపకు అంతర్జాతీయ విపణిలో మంచి ధర లభించి రైతుల ఆదాయం పెరగనుందని తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

## భారత్‌పై ప్రతీకార సుంకం 26%

**(మొదటిపేజీ తరువాయి)**

వాణిజ్య విభాగం: ప్రపంచ దేశాలన్నీ ఉత్కంఠగా ఎదురు చూసిన ప్రకటన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వెలువడింది. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న ఇతర దేశాలపై మాత్రం.. ఆయా దేశాలు విధిస్తున్న సుంకాల్లో సగం మేర తాము విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. భారత్ తమ ఉత్పత్తులపై 52% సుంకం విధిస్తున్నందున, తాము 26% సుంకం విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4 గంటలకు) వాషింగ్టన్ డీసీలోని వైట్‌హౌస్ రోజ్‌గార్డెన్‌లో తన క్యాబినెట్ సహచరుల సమక్షంలో ట్రంప్ వివిధ దేశాలపై విధిస్తున్న ప్రతీకార సుంకాలను వెల్లడించారు. వీటికి సంబంధించిన అధికారిక ఆదేశాలపై సంతకం చేశారు. చైనా, జపాన్, థాయ్‌లాండ్, వియత్నాం, భారత్ తమపై అధిక సుంకాలు విధిస్తున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అమెరికా పౌల్ట్రీ ఉత్పత్తులపై ఐరోపా కూటమి అనుసరిస్తున్న తీరును ట్రంప్ విమర్శించారు. వాహనాలు, వాహన విడిభాగాలపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు తెలిపారు.

## ఇరాన్ లక్ష్యంగా బి2 బాంబర్లు!

**(మొదటిపేజీ తరువాయి)**

వైమానిక దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో బి2 బాంబర్లను కూడా వినియోగించినట్లు ఇప్పటికే అంగీకరించింది. తాజాగా డీగో గార్సియాలో వాటి సంఖ్యను పెంచడానికి మాత్రం.. ఇరాన్‌తో ఉద్రిక్తతలే ప్రధాన కారణమంటూ విశ్లేషణలు వెలువడుతున్నాయి. వాషింగ్టన్ హెచ్చరికలను ఖాతరు చేయకుండా అణు కార్యక్రమాల్లో టెహ్రాన్ ఇటీవల జోరు పెంచింది. ఈ నేపథ్యంలో బి2 బాంబర్ల మోహరింపు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్‌లోని భూగర్భ అణు కేంద్రాలను ధ్వంసం చేయగల సామర్థ్యమున్న భారీ 'జీబీయూ 57' బాంబులను ఈ బాంబర్లు మాత్రమే మోసుకెళ్లగలవని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒక్కో జీబీయూ 57 బాంబు దాదాపు 12,300 కిలోల బరువుంటుంది.

## ప్రాజెక్టులు అడ్డుకుంటే.. రెడ్‌బుక్‌లోకి పేరు

**(మొదటిపేజీ తరువాయి)**

ఒంగోలు: న్యూస్‌టుడే, పీసీపల్లి: 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పీ4కు రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్లు నాంది కాబోతున్నాయి. వాటి స్థాపనతో రాష్ట్రంలో పేదరికం తొలగించే దిశగా తొలి అడుగు పడింది' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం దివాకరపల్లిలో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో లోకేశ్ ప్రసంగించారు. పేదరికాన్ని తొలగించాలనే ఉద్దేశంతోనే ఐదేళ్లలో 25 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నానని చెప్పారు. వైకాపా నాయకులు పనిచేయరు.. చేసే వారిని చేయనీయరని ఎద్దేవా చేశారు. ఉపాధి కల్పనకు తెచ్చిన పరిశ్రమలను అడ్డుకుంటే రెడ్‌బుక్‌లోకి పేరు ఎక్కిస్తామని హెచ్చరించారు. తప్పుడు ప్రచారం చేసే వారిని వదిలి పెట్టబోమన్నారు.

**కంపెనీలు ఏం తెచ్చారంటే.. సౌండ్ రాలేదు**

ఉమ్మడి అనంతపురంలో ఆటోమొబైల్ హబ్, చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, కర్నూలుకు పునరుత్పత్తి ఇంధన కంపెనీ, ప్రకాశం జిల్లాకు పేపర్ మిల్లును తీసుకొస్తే గత ప్రభుత్వం రానివ్వలేదని లోకేశ్ తెలిపారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో విధ్వంసం చోటుచేసుకుందని, కొత్త కంపెనీలు తీసుకురాకున్నా.. ఉన్న లులు, అమరరాజ, హెచ్‌ఎస్బీసీ, జాకీ వంటి కంపెనీల్లో వాటాలు ఇవ్వలేదని తరిమేశారని ఆరోపించారు. మీరు తీసుకొచ్చిన ఒక్క కంపెనీ పేరు చెప్పాలని నాడు ముఖ్యమంత్రిగా ఉన్న పులివెందుల ఎమ్మెల్యేను అడిగితే అటు నుంచి సౌండ్ రాలేదని ఎద్దేవా చేశారు.

## సంప్రదాయమే శాసనమై!

**(మొదటిపేజీ తరువాయి)**

అమెరికా అధ్యక్షుడిగా ఫ్రాంక్లిన్ డెలానో రూజ్‌వెల్ట్ ఒక్కరే నాలుగుసార్లు బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు.. ఆ తర్వాత ఎవరూ రెండు సార్లకు మించి అధ్యక్షుడిగా పని చేయలేదు. దీనికి రెండు కారణాలున్నాయి. ఒకటి.. రూజ్‌వెల్ట్ కంటే ముందు పని చేసినవారు రెండు సార్ల కంటే ఎక్కువ పని చేయకూడదనే సంప్రదాయాన్ని పాటించారు. అప్పట్లో ఎటువంటి రాజ్యాంగ నిబంధన లేదు. సంప్రదాయాన్ని రూజ్‌వెల్ట్ పాటించకపోవడంతో అమెరికా శాసనకర్తలు రాజ్యాంగ సవరణ ద్వారా రెండు సార్ల నిబంధనను తీసుకొచ్చారు. అమెరికా అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నిక కావడానికి మార్గాలున్నాయని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో మరోసారి ఈ అంశం తెరమీదకు వచ్చింది. తొలి తరం అధ్యక్షుల స్వచ్ఛంద నిర్ణయంతో.. 1940లో రూజ్‌వెల్ట్ మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అంతకు ముందు.. పని చేసిన అధ్యక్షులందరూ రెండు సార్ల సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ సంప్రదాయానికి తొలి తరం అధ్యక్షులు జార్జి వాషింగ్టన్, థామస్ జెఫర్సన్, జేమ్స్ మాడిసన్ పునాది వేశారు. వారు స్వచ్ఛందంగా మూడోసారి పోటీ చేసే అవకాశాల్ని వదులుకున్నారు. దానిని ఆ తర్వాత వచ్చిన అధ్యక్షులంతా కొనసాగించారు.

# 42% రిజర్వేషన్లకు సై అనకుంటే ధర్మయుద్ధమే

**సమయం న్యూస్,** దిల్లీ: "సంధి కోసం కనీసం ఐదు గ్రామాలైనా ఇవ్వాలని ఆనాడు కృష్ణుడు అడిగితే దుర్యోధనుడు వినకుండా విర్రవీగాడు. చివరకు కురుక్షేత్రంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. సయోధ్యలో భాగంగానే మేం హస్తినకు వచ్చి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అనుమతివ్వాలని మోదీకి విజ్ఞప్తి చేశాం. చట్టాలను సవరించి.. 42% రిజర్వేషన్ల అమలుకు అనుమతించకపోతే మీరు గద్దె దిగాల్సిందే.. గ్రామాల్లో మీ గద్దెలు కూలాల్సిందే. మమ్మల్ని తక్కువ అంచనా వేస్తే ఎర్రకోటపై జెండా ఎగరేస్తాం. మా రిజర్వేషన్లు మేం సాధిస్తాం" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ చేసిన తీర్మానానికి అనుగుణంగా రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతివ్వాలని కోరుతూ జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పలు బీసీ సంఘాలు దిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం మహాధర్నా నిర్వహించాయి. దీనికి సీఎం హాజరై మాట్లాడారు. "బీసీలకు 42% రిజర్వేషన్లపై శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానించి పంపినా.. అనుమతివ్వడానికి ప్రధానికొచ్చిన కష్టమేంది? బిల్లుకు అనుకూలమని జంతర్‌మంతర్ వేదికగా 16 పార్టీలు ప్రకటించాయి. తాను బీసీల కోసమే ఉన్నానని ప్రధాని మోదీ అంటున్నారు. బీసీల కోసం ప్రాణాలిస్తామని బండి సంజయ్ ప్రకటిస్తున్నారు. మేం మీ ప్రాణాలు కాదు.. 42% రిజర్వేషన్లు మాత్రమే కోరుతున్నాం. దీనికి అనుమతివ్వకపోతే.. దేశమంతా జాగృతం చేసి అన్ని సంఘాలను కూడగడతాం. నిప్పురవ్వలా రగిలి దేశమంతటా కార్చిచ్చులా వ్యాపిస్తుంది. మీరు దిల్లీ గద్దెపై ఎలా ఉంటారో చూస్తాం. మా డిమాండ్లకు మోదీ దిగైనా రావాలి... లేదంటే గద్దె దిగైనా పోవాలి. 2015లో ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ జంతర్‌మంతర్‌లో ధర్నా చేసి అలసిపోయి చెట్టు కింద కూర్చున్నప్పుడు 'మీది ధర్మమైన కోరిక కాబట్టి ధర్మయుద్ధం ప్రకటించాల'ని నేను చెప్పడంతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో లక్షల మంది సమక్షంలో ధర్మయుద్ధం ప్రకటించి విజయం సాధించి లక్ష్యం చేరుకున్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే పరేడ్ గ్రౌండ్‌లో పది లక్షల మందితో ధర్మయుద్ధం ప్రకటించి మన బలమేంటో చూపిద్దాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

*** రాహుల్ గాంధీ హామీ నెరవేర్చేందుకే కులగణన**

"కులగణనకు స్ఫూర్తి రాహుల్ గాంధీయే. ఆయన కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సుమారు 150 రోజులు.. 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినప్పుడు తమ జనాభా లెక్కలు తేల్చాలని ఆయనను బీసీ సంఘాల ప్రతినిధులు అడిగారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి జనగణనతోపాటు కులగణన కూడా చేయాలని.. దేశంలో ఎవరెంత మంది ఉన్నారో లెక్కతేల్చి దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని, నియామకాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. పార్టీ ఎక్కడ అధికారంలోకి వచ్చినా కులగణన చేస్తామని.. బీసీలకు ఉద్యోగావకాశాల్లోనే కాకుండా రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్ వాగ్దానం చేశారు. ఆయన ఇచ్చిన మాటను నెరవేర్చుతూ రాష్ట్రంలో మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కులగణన పూర్తి చేసి.. దేశానికి దిక్సూచిగా నిలిచాం. దేశంలో ఇంత పకడ్బందీగా కులగణన చేసిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణయే. భాజపా అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదు. కులగణన లెక్కలను ఫిబ్రవరి 4న చట్టసభలో ప్రవేశపెట్టాం. రాష్ట్రంలో బలహీనవర్గాలవారు 56.36 శాతం మంది ఉన్నట్లు లెక్క తేలింది. వారికి స్థానిక సంస్థల్లోనే కాకుండా విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు అమలు చేసినప్పుడే న్యాయం జరుగుతుంది. రిజర్వేషన్ల పెంపు అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంది కాబట్టే శాసనసభలో తీర్మానం చేసి పంపాం. మేం దీన్ని భాజపా పాలిత గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో అమలు చేయాలని అడగడం లేదు. తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు అనుమతివ్వాలని మాత్రమే అడుగుతున్నాం.

# 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్లు తితిదేను తీర్చిదిద్దాలి

**(మొదటిపేజీ తరువాయి)**

తిరుపతి దేవస్థానాలపై సీఎం చంద్రబాబు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరితోపాటు ఉన్నతాధికారులతో బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. 'తితిదే రూ.వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమాలకు ఖర్చు చేస్తోంది. అందులో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు. అంతర్గత ఆడిట్‌తోపాటు, కాగ్ ద్వారా కూడా ఆడిట్ జరిపించాలి. భక్తులు విరాళంగా ఇచ్చే ప్రతి రూపాయికీ జవాబుదారీతనం ఉండాలి' అని ఆదేశించారు. 'తితిదేలో సమూల ప్రక్షాళన చేస్తామని ఎన్నికల ముందు చెప్పాను. అధికారంలోకి వచ్చాక మార్పులు చేశాం. ఇంకా 100 శాతం మార్పులు ఉండాలి. ఎక్కడా పాత వాసనలు, పాత వ్యక్తులు ఉండకూడదు. అనుభవజ్ఞుల పేరుతో పాతవారెవరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగించొద్దు. జేఈవో, చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీవీఎస్‌వో), ఎస్వీబీసీ ఛైర్మన్, బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్ల నియామకం త్వరలో చేపడతాం' అని సీఎం తెలిపారు. 'తితిదేకి చెందిన 15 రకాల సేవలను వాట్సప్ ద్వారా అందించే కార్యక్రమం వెంటనే ఆరంభించాలి. ప్రతి సేవకు ఆధార్, ఫోన్ నంబరును అనుసంధానిస్తే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చు. పారిశుద్ధ్య నిర్వహణపైనా ప్రత్యేక దృష్టి సారించాలి. తిరుమలలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు అన్ని అవకాశాలను వినియోగించుకోవాలి. తితిదే పరిధి 2,675 హెక్టార్లలో విస్తరించి ఉండగా, అందులో 68.14 శాతమే పచ్చదనం ఉంది. దీనికి 80 శాతానికి పెంచాలి' అని చంద్రబాబు ఆదేశించారు. శ్రీవారి సేవకుల్లో 90 శాతం కొత్తవారు ఉంటున్నారని అధికారులు తెలపగా, సగం మంది పాతవారు ఉండేలా చూస్తే నాణ్యమైన సేవలు అందించొచ్చని సీఎం సూచించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి నిత్యం 25 వేల మంది వరకు భక్తులు వస్తారని అధికారులు వివరించగా.. ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలిపిరిలో 25 వేల మంది భక్తులకు సౌకర్యంగా ఉండేలా బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నామని, 60 అనుబంధ ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని అధికారులు తెలిపారు.

# వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**సమయం న్యూస్,** దిల్లీ: సుదీర్ఘ సంవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు 2025కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్ష ఇండియా కూటమి, ఎంఐఎం తదితర పక్షాల ఆరోపణలను, విమర్శలను అధికార పక్షం గట్టిగా తిప్పికొట్టింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మైనారిటీ వ్యవహారాల మంత్రి రిజిజు దీటుగా జవాబిచ్చారు. అధికార, విపక్ష సభ్యుల వాద ప్రతివాదాలతో సభ ప్రతిధ్వనించింది. బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం తెల్లవారుజాము 2.15 గం.లు దాటే వరకూ చర్చ, ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. ఇటీవల కాలంలో ఇంత సుదీర్ఘ సమయం పాటు లోక్‌సభ భేటీ కొనసాగడం ఇదే ప్రథమం. బిల్లుకు ఎన్డీయే ప్రధాన భాగస్వామ్యపక్షాలైన తెదేపా, జేడీ(యు), శివసేన (శిందే), లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) మద్దతివ్వడంతో భాజపాలో ఉత్సాహం ఇనుమడించింది. మరోవైపు విపక్ష ఇండియా కూటమిలోని పార్టీలు ముక్తకంఠంతో బిల్లును వ్యతిరేకించాయి. తీవ్ర నిరసనను ప్రకటించిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తన చేతిలోని బిల్లు ప్రతిని చింపివేశారు. వైకాపా కూడా బిల్లుకు ప్రతికూలంగానే స్పందించింది. చర్చ, ఆమోదం కోసం వక్ఫ్ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. విపక్షాల నిరసనల మధ్యే మధ్యాహ్నం 12 గంటల సమయంలో వక్ఫ్ బిల్లును ప్రవేశపెడుతూ కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంటు భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విస్తృత మంతనాలు జరిపి బిల్లులో పలు మార్పులు చేసిందని తెలిపారు. ముస్లింల మత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని విస్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల నిర్వహణను సమర్థంగా, పారదర్శకంగా కొనసాగించటానికి యత్నిస్తున్నామని తెలిపారు. "దేశంలో రైల్వేలు, రక్షణ శాఖ తర్వాత భారీగా ఆస్తులుంది వక్ఫ్ బోర్డుల నియంత్రణలోనే. రైల్వేలు, రక్షణ శాఖ ఆస్తులు దేశానికి చెందుతాయి. స్వభావ రీత్యా వక్ఫ్ ఆస్తులు ప్రైవేటువే. పేద ముస్లింలకు వీటిని ఉపయోగించాలి. నిరుపేదల ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి" అని రిజిజు తెలిపారు. వక్ఫ్ బిల్లు పేరును...యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫీషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ బిల్లుగా (ఉమీద్ యుఎంఈఈడీ)గా వ్యవహరించనున్నట్లు చెప్పారు. దీంతోపాటు 'ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహరణ) బిల్లు 2024'ను కూడా లోక్‌సభలో చర్చ, ఆమోదం కోసం కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. సుదీర్ఘ చర్చ అనంతరం విపక్షాల విమర్శలకు సమాధానమిస్తూ... 'ప్రపంచంలో మైనారిటీలకు భారత్ కన్నా సురక్షితమైన దేశం మరొకటి లేద'ని తెలిపారు. తాను కూడా మైనారిటీ వర్గానికి చెందిన వాడినేనని పేర్కొన్నారు. వక్ఫ్ ట్రైబ్యునళ్ల వద్ద చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బిల్లు చట్టరూపం దాల్చిన తర్వాత అవన్నీ సత్వరమే పరిష్కారమవుతాయని వివరించారు. అనంతరం విపక్ష సభ్యులు పట్టుపట్టడంతో సవరణలపై సభాపతి విడివిడిగా ఓటింగ్

# మీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా?

**సమయం న్యూస్,** ఢిల్లీ, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో చేసిన బిల్లు అమలు నుంచి తప్పించుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ సంఘాల ముసుగులో దిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నాకు దిగారని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచడంలో రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని.. తాము ముందు నుంచీ చెప్తున్నది ఇప్పుడు మరోసారి నిరూపితమైందన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు ఆ బాధ్యతను కేంద్రంపై ఎలా నెడతారు? రిజర్వేషన్ల పెంపు మీ పరిధిలో లేకపోతే ఆ హామీ ఎలా ఇచ్చారు? రేవంత్‌రెడ్డి అసలైన బీసీ ద్రోహి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీయే ఇప్పుడు రేవంత్ వెనకుండి ఈ డ్రామాలు ఆడిస్తున్నారు. ఒక బీసీ వ్యక్తి ప్రధాని అయితే జీర్ణించుకోలేక మోదీని రాహుల్ గాంధీ తూలనాడిన విషయాన్ని బీసీలు ఇంకా మరచిపోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో బీసీల జనాభా 46% అని చెప్తున్నారు. కానీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా? సగానికి పైగా ఉన్న బీసీలకు మీరిచ్చిన మంత్రి పదవులు రెండంటే రెండే. దీనిని బట్టే తెలుస్తుంది బీసీల మీద వారికి ఎంత ప్రేమ ఉందో. ప్రత్యేక ఎంబీసీ మంత్రిత్వశాఖ అన్నారు, ఏమైంది? మోదీ ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# 'అమరావతి చిత్రకళ వీధి'తో కళాకారుల ప్రతిభకు గుర్తింపు

**సమయం న్యూస్,** అమరావతి: 'అమరావతి చిత్రకళ వీధి' లాంటి వేదికల ద్వారా కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కలుగుతుందని, ప్రభుత్వం కూడా దీనికి అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం జరగనున్న 'అమరావతి చిత్రకళ వీధి' కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి.. సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా 'అమరావతి' థీమ్‌తో రూపొందించిన చిత్రానికి రంగులు వేసి చంద్రబాబు మద్దతు ప్రకటించారు. తన చిన్నతనంలో చిత్రలేఖనం వేసినప్పటి అనుభూతి కలిగినట్టు వివరించారు. "కూటమి ప్రభుత్వంలో కళాకారులు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తున్నాం. ప్రోత్సహిస్తున్నాం. కళల్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళతాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు.



www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# జిల్లాలో చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ

**: జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

సంగారెడ్డి, ఏప్రిల్ 02 (సమయం న్యూస్) : జిల్లాలోని అన్ని మండలాలలో చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధి దారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం చొప్పున సన్న బియ్యం పం పిణీ కార్యక్రమం ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాలకు సన్నబియ్యం పౌరసరఫరాల శాఖ గోదాముల నుండి సరఫరా జరిగినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సన్నబియ్యం పం పిణీ కార్యక్రమం జిల్లాలో అన్ని మం డలాలలో ఆయా మండలాల చెందిన ప్రజాప్రతినిధులు అధికారులు మం గళవారం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 846 రేషన్ దుకాణాల ద్వారా 378728 రేషన్ కార్డులకు. 79987.81 క్వింటాల రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డులో పేర్లు నమోదు అయిన ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన సన్న బియ్యం ఈ పథకాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కుషాయిగూడలో రేషన్ షాప్ ల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉప్పల్ mla బండారు లక్ష్మ రెడ్డి పాల్గొన్న స్థానిక నాయకులు

**- సమయం న్యూస్:**

# ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశం

నిజామాబాద్ ఏప్రిల్ 02 ( సమయం న్యూస్) : నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 04042025 న తేదీన ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి. పి మధుసూదన్ రావు గారు తెలియజెసినారు. ఇట్టి ఉద్యోగ మేళాకు E.Com express (ఈ .కం ఎక్స్ప్రెస్ ), Amazon (అమెజాన్) కంపెనీ ల వారు ఈ క్రింది ఉద్యోగాల కోసం నియామకాలు చేపడుతారు. ఉద్యోగాలు: Telecollers (టెలి కాలేర్స్ ),Supervisors(సూపర్ వైజర్స్ ), Sales Executive (సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ), Delivery Boys (డెలివరీ బాయ్స్)


* అర్హతలు:Intermediate (ఇంటర్మీడియట్), Any Degree (ఏదైనా డీగ్రీ),పాసైనా Male (మగవారు), Female (ఆడవారు) వారు అర్హులు.
* జాబ్ లొకేషన్: నిజమాబాద్ మరియు హైదరాబాద్
* ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం , శివాజీ నగర్, నిజామాబాదు నందు 04042025 నాడు ఉద్యోగ మేళ ఉదయం 10.30 గం'ల నుండి మధ్యాహ్నం లోపల పాల్గొనగలరు.
* ఇతర వివరాలకు 9948748428, 6305743423, 77022 59070 ఫోన్ ద్వారా సంప్రదించగలరు. అభ్యర్థులు తమ Resume, బయో డేటా, ఆదరికార్డు, SSC మెమో, ఫోటో తీసుకురాగలరు

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలి

**: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్, ఏప్రిల్ 2, సమయం న్యూస్ : బడుగు బలహీనవర్గాలు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్ట మొదటి మహా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సాధారణ కుటుంబంలో జన్మించి పశువుల కాపరిగా, గీతా కార్మికుడిగా తన ప్రస్థానంలో భాగంగా అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సలిపిన మహాయోధుడని అన్నారు. ఎటువంటి అండదండలు లేకుండా బడుగు కులాలను ఏకం చేసి భూస్వాములు, మొగల్ లు శిస్తుల రూపంలో పన్నుల వసూల్ల పేరుతో ప్రజలను పీడిస్తున్న క్రమంలో వారికి అండగా నిలిచి పోరాటం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డిబీసీడిఓకె ఉపేందర్, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి అధికారులు మల్లేశం, కమలాకర్ రెడ్డి, డిపిఓ జయసుధ, డిఎంహెచ్ వెంకటరమణ, మిషన్ భగీరథ ఇఇ చల్మారెడ్డి, జిల్లా ఏబీసీడిఓ భీమరాజు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని ఎమ్మెల్సీ నాగబాబు గారు మర్యాదపూర్వకరంగా కలిశారు. శాసనమండలి ఛైర్మన్ కార్యాలయంలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నాగబాబు సచివాలయంలో సీఎంను కలిశారు.

# సన్న బియ్యం పంపిణీ సాఫీగా జరగాలి

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

నిజామాబాద్, ఏప్రిల్ 02 : (సమ యం న్యూస్) జిల్లాలో సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. నిజా మాబాద్ నగరంలోని శివాజీనగర్ లో గల 21వ నెంబర్ రేషన్ షాపును కలెక్టర్ బుధవారం సందర్శించి, లబ్దిదారులకు స్వయంగా సన్న బియ్యం పంపిణీ చేశారు. రేషన్ దుకాణానికి కేటాయించబడిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, కోటాకు అనుగుణంగా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేసి, దానికి అనుగు ణంగా బియ్యం స్టాక్ ఉందా అని పరిశీలించారు. బయోమెట్రిక్ ద్వారా రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని గమనించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తన వెంట ఉన్న అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క దుకాణంలోనూ సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదని అన్నారు. జిల్లాలో రేషన్ కార్డులు కలిగిన 4,02,154 కుటుంబాలలోని 13,10,012 మంది సభ్యులకు ప్రతీ నెల 8248.076 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మంగళవారం నుండి సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, బుధవారం మధ్యాహ్నం నాటికి 3183.095 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ పూర్తయ్యిందని, మొత్తం కోటాలో 38 శాతం పంపిణీ జరిగిందని కలెక్టర్ వివరించారు. కాగా, జాప్యానికి తావు లేకుండా సకాలంలో లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ జరిగేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సహాయ అధికారి రవి రాథోడ్, రేషన్ డీలర్ హిమబిందు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా కార్యదర్శి పార్థసారథి, నగర కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి విక్కీ యాదవ్ తదితరులు ఉన్నారు.

# చందా నగర్ జీహెచ్ఎంసీలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

రంగారెడ్డి జిల్లా, సమయం న్యూస్ : బుధవారం సన్న బియ్యం పం పిణీ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గం చందా నగర్ లోని జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాల్ నందు శేరిలింగంపల్లి శాసన సభ్యులు అరికెపూడి గాంధీ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ శాసనసభ నియోజకవర్గంలో సన్న బియ్యం పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని, ప్రజా ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డ్ కలిగిన లబ్ధిదారులు అందరూ సన్న బియ్యంతో సంతృప్తిగా భోజనం చేయాలనే ఉద్దేశంతో సన్న



బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారం భించామన్నారు. ఈ సన్న బియ్యం పథకం ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి మనిషికి 06 కేజీలు చొప్పున అందిస్తున్నట్లు వివరించారు. అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క దుకాణంలోనూ సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.బి.సి. ఛైర్మన్ జయపాల్ యాదవ్, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.శ్రీనివాస్, సివిల్ సప్లయ్ మేనేజర్ గోపీకృష్ణ, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల కు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి

* **జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అభిలాష అభినవ్**

నిర్మల్ ఏప్రిల్ 02 (సమయం న్యూస్): యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆమె యాసంగి వరి కొనుగోలు ప్రక్రియ నిర్వహణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. త్వరితగతిన కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు సిబ్బందికి శిక్షణను ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాలలో సరిపడినన్ని తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, గన్ని సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సరిపడినంతమంది హమాలీలు, లారీలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, టెంట్, ధాన్యం మద్దతు ధర తెలిపే బోర్డులు, కంట్రోల్ రూమ్ నెంబర్, కొనుగోలు కేంద్రానికి సంబంధించిన ఏజెన్సీ ఫోన్ నంబర్ లను ప్రదర్శించాలన్నారు. ధాన్యం తూకం జరిగిన 24 గంటల లోపు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు సంబంధించి అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్యాడి క్లీనింగ్ యంత్రాల ద్వారా రైతులు తమ వరి ధాన్యాన్ని శుభ్రపరిచి తూకం వేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నాటి నుంచి రోజువారీగా ధాన్యం కొలుగోలుకు సంబంధించిన వివరాల నివేదికలను



అందజేయాలన్నారు. రైస్ మిల్లర్లు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుధాకర్, ఇన్ చార్జి డీఆర్డిఓ శ్రీనివాస్, ఇన్ చార్జి ఏడి మార్కెటింగ్ గజానంద్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీసీఓ కార్యాలయ అధికారి రాజమల్లు, రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్ పోర్ట్ ప్రతినిదులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

www.epapersamayam.com
APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక



## సంపాదకీయం

# కాంగ్రెస్.. తీరుమార్చుకోవాలి !

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పయనం అగమ్యగోచరంగా ఉంది. ముఖ్యంగా ఎపిలో కాంగ్రెస్ చుక్కాని లేని నావలా తయారయ్యింది. అక్కడ ఎవరు వచ్చినా ఆ పార్టీ బతికి బట్టకట్టడం కష్టం. గత ఎన్నికలకు ముందు షర్మిల పగ్గాలు చేపట్టినా పెద్దగా లాభం లేకుండా పోయింది. చివరకు ఆమె కూడా గెలవలేదు. వైఎస్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవడంలో జగన్ సఫలమైనా..పాలనలో విఫలం అయ్యారు. స్వార్థపూరిత రాజకీయాలు జగన్ పతనాన్ని శాసించాయి. ఇప్పుడు షర్మిల పోరాటం వల్ల జగన్‌కు నష్టం జరగిందే తప్ప కాంగ్రెస్‌కు లబ్ది చేకూరలేదు. తెలంగాణలో బిజెపికి దక్కాల్సిన అధికారం అనూహ్యంగా కాంగ్రెస్‌కు దక్కింది. రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక చేస్తున్న కార్యక్రమాలు కొంతమేరే ఫలితం ఇచ్చినా, సమర్థ నేతగా రుజువు చేసుకోలేక పోతున్నారు. బహునాయకత్వం, ప్రతిదానికీ హైకామండ్ ముందు మోకరిల్లాల్సి రావడం వంటి కారణాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో పలచనవుతోంది. మంత్రులతంతా ఎవరికివారు యమునా తీరే అన్నట్లుగా ఉంటున్నారు. తమ శాఖల పరిధిలోని కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయలేక పోతున్నారు. దేవాయదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు ఈ రెండు శాఖల్లో ఏం జరుగుతుందో తెలియడం లేదు. అడవుల పెంపకం లేదు. కోతులు గ్రామాలను పట్టిపీడిస్తున్నా పట్టించుకోవడం లేదు. దేవాలయ భూముల చెరను విడిపించలేకపోతున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలకే పరిమితం అయ్యారు. ఎక్కడా రోడ్ల అభివృద్ధి జరగడం లేదు. రాజధాని హైదరాబాద్ అంతర్గత రోడ్లు ఏడాది దాటినా అభివృద్ధిక నోచలేదు. గ్రామాల్లో నిధులు విడుదల కాకపోవడంతో పనులు పడకేశాయి. ఇలా ఒక్కోమంత్రి తీరు ఒక్కోలా ఉంది. శాఖల్లో పనులు సక్రమంగా సాగడం లేదు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ప్రజలను పట్టించుకోదు.. ప్రతిపక్షంలో ఉంటే విపక్షంగా గట్టి పాత్ర నిర్వహించదు. అధికారం కోసం వెంపర్లాడడం తప్ప అణగిమణిగి ఉండాలన్న ఆకాంక్ష కానరాదు. పార్టీని బలోపేతం చేయడం కోసం ఎవరూ పాటుపడరు. పాటుపడేందుకు ఎవరైనా ముందుకు వస్తే కాళ్లు లాగేస్తుంటారు. అధికారం వస్తే పదవుల కోసం పాకులాడుతారు. అధికారం లేకుంటే కీచులాటతో పార్టీని భ్రష్టు పట్టిస్తుంటారు. మొత్తంగా కాంగ్రెస్‌లో ఒకరిపై ఒకరికి విశ్వాసం ఉండదు. నాయకత్వాన్ని సహించే లక్షణం లేదు. నాయకుడు ఎవరైనా కాళ్ళల్లో కట్టెలు పెట్టడం అలవాటు. అలా పార్టీకిచేటు జరుగుతున్నా పట్టించుకోరు. తాజాగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఇదే ధోరణి కనిపిస్తోంది. బిఆర్‌ఎస్, బిజెపిలు చేస్తున్న విమర్శలను సమర్థంగా తిప్పికొట్టలేక పోతున్నారు. హైదరాబాద్ భూముల విషయంలో వీరి వాదన పేలవంగా ఉంది. నిజానికి భూమిని కోర్టులో పోరాడి దక్కించుకుంటే దానిని రక్షించాలి తప్ప అమ్మరాదు. సన్నబియ్య, పెన్షన్ల పేరుతో దుబారా చేసే బదులు దుబారాకు కళ్లెం వేయాలి.ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఎవరికి వారే అధికార కూటమిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది నిజంగా ఆత్మహత్య సదృశ్యమే. ఇలా జాతీయ స్థాయిలోనూ కనిపిస్తాయి. అధికారంలో ఉంటే కళ్లు నెత్తికెక్కుతాయి. పార్టీలో ఎవరైనా పెత్తనం చెలాయిస్తారని భావిస్తే అలాంటి వారిని అసలు చేరకుండా అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. పార్టీపరంగా రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉంటారే తప్ప పరిష్కారనికి ముందుకు రారు. జాతీయస్థాయిలో అయినా.. రాష్ట్రస్థాయిలో అయినా ఇదే పరిస్థితి ఉంటుంది. తాజాగా తెలంగాణలో జరుగుతున్న పరిస్థితులు కూడా ఇందుకు భిన్నం కాదు. రేవంత సిఎంగా ముందుకు నడుస్తున్న వేళ..పటిష్ట నిర్ణయాలపై చర్చించడం లేదు. సమస్యలను చర్చించి పరిష్కరించే చర్యలు కానరావడం లేదు. ఉమ్మడిగా పినచేయడం లేదు. కేవలం రేవంత్ మాత్రమే అందరినీ కలుపుకుని పోయేలా ఉంటున్నారు. పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పెద్దగా పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీ పరువు పోయినా, ఉన్న వారు బయటకు పోతున్నా.. ఉన్నవారు మాత్రం బింకాన్ని వదలకుండా తమకోసం పోరాడుతారు. తెలంగాణలోని పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా ఈ జాడ్యం పట్టుకుంది. పార్టీలో వ్యతిరేకంగా పనిచేయడం పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌సగా పరిగణించి..రేవంత్ రెడ్డికి పూర్తి అధికారం ఇచ్చి నడిపించడం లేదు. ఎందుకంటే రాజకీయాలు చేయడం అక్కడే మొదలవుతోంది. అధిష్టానం కర్నాటక, తెలంగాణలను పిండేస్తోందని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ భూముల అమ్మకం వెనకా ఒత్తిళ్లు ఉన్నాయని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ బలహీన పడితే, ఆ పరిస్థితి ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే లాభిస్తుంది. కొన్ని రాష్ట్రాలలో మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ ఎదురెదురు నిలిచి ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో బీజేపీ బలహీన పడితే కాంగ్రెస్ కొంత లబ్ధి పొందవచ్చు. బీజేపీ ఎంత బలహీనపడినా, కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం అనుమానమే. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బీజేపీకి, కాంగ్రెస్`కు సవాలుగా ఉన్నాయి. తమ రాష్ట్రాలలో బీజేపీని, కాంగ్రెస్‌ను ఓడిరచిన ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ఈ క్రమంలో అధికారంలో కొనసాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ గత బిఆర్‌ఎస్ పాలనకు భిన్నంగా నడుచుకోవాలి. మాటలు, పదేపదే విమర్శలు కట్టిపెట్టి ప్రజల కోం అంతా కలసి పనిచేయాలి. హైదరాబాద్ భూముల వివాదాన్ని పక్కన పెట్టాలి. వాటిని అమ్మాలన్న ఆలోచనను పక్కకు పెట్టాలి. అందుకు ప్రత్యమ్నాయంగా ఉచిత పథకాలకు కోతలు పెట్టాలి. అప్పుడే పార్టీకి ఆదరణ పెరుగుతుంది. పార్టీని, ప్రభుత్వాన్ని ఇలాగే కొనసాగిస్తే కాంగ్రెస్ గత చరిత్ర పునరావృతం కాగలదు.

# ప్రజలకు నీటి ఇబ్బందులు కలుగ కుండా చర్యలు చేపట్టండి

: నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి

* కడిపికొండ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో వాల్వ్ ను తనిఖీ చేసిన మేయర్...
* వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ లో క్షేత్ర స్థాయి లో పరిశీలన..



వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 02, (సమయం న్యూస్): ప్రజలకు నీటి ఇబ్బందులు కలుగ కుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరం లో నీటి సరఫరా తీరును పరిశీలించే క్రమం లో మేయర్ బుధవారం నగర పరిధి లోని వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ తో పాటు ధర్మ సాగర్ నుండి 1000 ఏం ఎల్ డి డయా పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా జరిగే వాల్వ్ ను కడిపికొండ రాజీవ్ గృహ కల్ప ప్రాంతం లో మేయర్ ఆకస్మికం గా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాంపూర్ ఖిలా వరంగల్ ప్రాంతం లో నీటి సరఫరా లో అంతరాయం ఏర్పడినట్లు తన దృష్టికి రావడం జరిగిన నేపధ్యం లో కడిపికొండ ప్రాంతం లో వాల్వ్ ను పరిశీలించడం జరిగిందని నీటి సరఫరా లో ఏర్పడ్డ అవాంతరాలకు గల కారణాలను అధికారులను మేయర్ అడిగి తెలుసు కొని మాట్లాడుతూ హన్మకొండ వరం గల్ ప్రాంతాలకు నీటి సరఫరా లో ఇబ్బందులు లేకుండా ఇరు ప్రాంతాలకు సమానం గా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని లీకేజీల ద్వారా నీటి వృథా జరిగే అవకాశం ఉన్నందున ఎప్పటికపుడు అరికట్టి నీటి సరఫరా సక్రమం గా జరిగేలా ఏ ఈ లు నిత్యం క్షేత్ర స్తాయి లో పర్యటిస్తూ నీటి సరఫరా లో ఏర్పడే సమస్యలను పరిష్కరించాలని డి ఈ లు వారి పని తీరును పర్యవేక్షించాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ లు శ్రీనివాస్ రవికుమార్ సంతోష్ బాబు మహేందర్ మాధవి లత డిఈ లు సారంగం కార్తీక్ రెడ్డి ఏ ఈ లు రామన్న మొజామిల్ మేనక హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన కలెక్టర్లు, కమిషనర్

* ఆధునిక టెక్నాలజీ తో చెత్త నుండి వేరు చేస్తున్న వివిధ పద్ధతుల పరిశీలన
* జీడబ్ల్యూఎంసీ పరిధిలోనూ ఇదే తరహా విధానం అమలుకు యోచన
* శుక్రవారం రాంపూర్ డంపింగ్ యార్డు ను పరిశీలించనున్న రాంకీ సంస్థ ప్రతినిధులు



హైదరాబాద్, ఏప్రిల్ 2 (సమయం న్యూస్): జిహెచ్‌ఎంసి పరిధిలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డును వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం సందర్శించారు. జీహెచ్‌ఎంసీలో అమలవుతున్న ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతి, చెత్త నుంచి విద్యుత్తు తయారీ, చెత్త ట్రాన్స్ఫర్ తయారీ స్టేషన్లను వారు పరిశీలించారు. హైదరాబాద్ లోని వివిధ డివిజన్ల నుండి చెత్తను ఏ విధంగా తరలిస్తున్నారు, డంపింగ్ యార్డు వద్ద ఎలాంటి పద్ధతులను అనుసరిస్తు న్నారు, చెత్తను ఏ విధంగా రీసైక్లింగ్ చేస్తున్నారనే విషయాలను క్షేత్రస్థాయిలో ఇరువురు కలెక్టర్లు, కమిషనర్ అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ చెత్తతో విద్యుత్తును ఉత్పత్తి చేయడం అద్భుతమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌కు తరలించి ఆధునిక టెక్నాలజీతో అద్భుతాలు సృష్టించడం అభినందనీయమని కలెక్టర్లు కొనియాడారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో చెత్త నుంచి కరెంట్, గ్యాస్ ను తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించామని, ఇదే తరహాలో గ్రేటర్ వరంగల్ లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. డంపింగ్‌యార్డ్‌లో కొత్త టెక్నాలజీతో చేస్తున్న అధ్యయనాలు బాగున్నాయని వారు ఈ సందర్భంగా కితాబిచ్చారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టడీ టూర్‌లో భాగంగా డంపింగ్‌యార్డ్‌ను సందర్శించిన కలెక్టర్లు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెత్త నుండి వేరు చేయడానికి అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులు, వ్యర్థ పదార్థాల ద్వారా వివిధ రకాల ఉత్పత్తి, నిర్వహణ గురించి కలెక్టర్లు, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ లకు ఘన వ్యర్థాల నిర్వహణ చేపడుతున్న రాంకీ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాంపూర్ డంపింగ్ యార్డు ను జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వద్ద సాలీడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్న రాంకీ సంస్థ ప్రతినిధులు జిడబ్ల్యూఎంసీ కు శుక్ర వారం సందర్శించి రాంపూర్ డంపింగ్ యార్డ్ వద్ద శాశ్విత ప్రతిపాదికన అనుసరించవలసిన పద్ధతులను, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిడబ్ల్యూ ఎంసీ ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, సంబంధిత అధికారులు, రాంకి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్.ఆర్.ఎస్ రిబేటు సదుపాయం గడువు పొడిగింపు

* ఏప్రిల్ 30 వరకు చెల్లింపులకు అవకాశం
* సద్వినియోగం చేసుకోవాలని కోరిన కలెక్టర్

నిజామాబాద్, ఏప్రిల్ 02 : అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ సదుపాయాన్ని పొడిగించిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మార్చి 31వ తేదీ నాటితో ఈ గడువు ముగియగా, ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఎల్.ఆర్.ఎస్ గడువును ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించిందని అన్నారు. జిల్లాలోని అర్హులైన వారందరూ ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్ కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకోవచ్చని సూచించారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఏప్రిల్ 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని కలెక్టర్ వెల్లడించారు. వివిధ కారణాల వల్ల రెగ్యులరైజేషన్ చేసుకోలేకపోయిన వారి కోసం మరో అవకాశం కల్పిస్తూ రాయితీ సదుపాయం గడువును ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించిందని అన్నారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు ఉందని కలెక్టర్ సూచించారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని, దీనిని దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారందరు ఈ నెల 30వ తేదీ లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ప్రభుత్వం పొడిగించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

# పేదలకు సమృద్ధిగా సన్న బియ్యం సరఫరా

* జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
* ఒక వ్యక్తికి 6 కిలోల సన్న బియ్యం సరఫరా
* సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి, ఏప్రిల్ 02(సమయం న్యూస్): పేదలకు సమృద్ధిగా సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని గ్యాస్ గోదాం వద్ద గల సుభాష్ నగర్ లో ప్రభుత్వం చేపట్టిన రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాష్ట్రంలోని రేషన్ షాపులలో తెల్ల కార్డు దారులకు ఇక నుంచి ప్రతి నెల సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వానాకాలం వరి పంట కొనుగోలు సమయంలో రైతులకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ చెల్లించి సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోలు చేసిన సన్న రకం ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ఉన్న 413 చౌక ధరల దుకాణాల ద్వారా ఇక నుంచి సన్న రకం బియ్యం మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందని, దీనికీ అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలో 4 లక్షల క్వింటాళ్ల సన్న రకం బియ్యం రేషన్ షాప్ లో వద్ద అందుబాటులో ఉంచామని, పేదలకు అవసరమైన మేర బియ్యం అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో అధిక సంఖ్యలో సన్న రకం ధాన్యం పండటంతో మన జిల్లా అవసరాలు తీరడంతో పాటు ఆసిఫాబాద్ జిల్లాకు కూడా ఎగుమతి చేశామని కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎక్కడ క్వాంటిటీ లో తేడా రాకుండా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులు, రేషన్ డీలర్లను ఆదేశించారు. ప్రజల కూడా ప్రభుత్వ అందిస్తున్న సందర్భంగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ, దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా మన ముఖ్యమంత్రి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకొని ఉగాది పండుగ నుంచి పేదలకు సన్న బియ్యం రేషన్ ద్వారా సరఫరా చేస్తున్నారని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గం లో 55 రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా కార్యక్రమం జరుగుతుందని, అవసరమైన పరిస్థితులు ఉంటే అదనపు షాపులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ప్రజలకు రేషన్ ద్వారా దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా చేశారని, దీని వల్ల చాలా వరకు రీసైక్లింగ్ జరిగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే సంవత్సరానికి 2 వేల 700 కోట్లు భరిస్తూ పేదల కోసం సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 గ్యాస్ సిలిండర్ సరఫరా వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు 2 లక్షల రుణ మాఫీ, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గం లో 59 కోట్ల 62 లక్షల రూపాయలను రైతు ఖాతాలలో బోనస్ క్రింద జమ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, డి.యం. శ్రీకాంత్ , సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్ 1 ర్యాంకర్ ను అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ఏప్రిల్ 02,(సమయం న్యూస్) : గ్రూప్ 1 పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన మంథని కి చెందిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన ఛాంబర్ లో తనను కలిసిన గ్రూప్ 1 అభ్యర్థి జక్కుల అరుణ కుమార్ ను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 1 పోటీ పరీక్షల్లో మంథని మండలం ఖాన్ సాయి పేట గ్రామానికి చెందిన జక్కుల అరుణ కుమార్ రాష్ట్రస్థాయిలో 114వ ర్యాంకు, మల్టి జోనల్ 1 స్థాయిలో 64వ ర్యాంకు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంతోషం వ్యక్తం చేస్తూ సంబంధిత విద్యార్థిని, అతని తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, తల్లిదండ్రులు మల్లేశ్వరి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎస్ రాయితీ గడుగు పొడిగింపు

- **ఏప్రిల్ నెలాఖరు వరకూ రాయితీ తో ఫీజు చెల్లింపునకు అవకాశం**
- **ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్**

సమయం న్యూస్: లేఅవుట్ల క్రమ బద్ధీకరణ పథకం(ఎస్ఆర్ఎస్) రాయితీ గడువును ప్రభుత్వం పొడిగించింది. ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్ జి ఓ 182 ను జారీ బుధవారం జారీ చేశారు. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. ఎస్ఆర్ఎస్ ఫీజును 25% రాయితీతో చెల్లించేందుకు మార్చి 31 వరకు గడువు ఇచ్చింది. తాజాగా ఆ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.




## కొండాపూర్ ఆర్ఐ సస్పెన్షన్.. తహసిల్దార్ బదిలీ

- **వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరులో అవకతవకల పై కలెక్టర్ ఆగ్రహం.**



సంగారెడ్డి, ఏప్రిల్ 02(సమయం న్యూస్): వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు లో అవకతవకలకు పాల్పడిన కొండాపూర్ ఆర్ఐ మహాదేవు సస్పెన్షన్, వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు పర్యవేక్షణ నిర్లక్ష్యం కారణం గా తాసిల్దార్ ఏస్తేరు అనిత ను నారాయణఖేడ్ ఆర్ డి ఓ కార్యా లయం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా బదిలీ చేస్తూ చేస్తూ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండాపూర్ మండలం లో ఆర్ ఐ తప్పుడు పంచనామా నివేదిక ఆధారంగా తహసిల్దార్ వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. ఈ విషయం కలెక్టర్కు బాధితులు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపిన కలెక్టర్, ఆర్ ఐ ని సస్పెన్షన్ చేస్తూ తాసి ల్దార్ ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు.

# జలమండలికి వరల్డ్ వాటర్ అవార్డు..

జలమండలిని వరల్డ్ వాటర్ అవార్డు వరించింది. వాటర్ డైజెస్ట్ అనే ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 2024 2025 సంవత్సరానికి వరల్డ్ వాటర్ అవార్డ్స్ లో జలమండలికి గవర్నమెంట్ కేటగిరిలో ఉత్తమ ఎస్టీపీ అవార్డు లభించింది. యునెస్కో భాగస్వామ్యంతో నిర్వహించిన 19వ వాటర్ డైజెస్ట్ వరల్డ్ వాటర్ అవార్డ్స్ (20242025) సంవత్సరానికి ఎస్టీపీ/ మురుగు నీటి శుద్ధి అవార్డు లభించింది. ఈ అవార్డును జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ ప్రధాన కార్యాలయంలోని మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్ లో ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ లకు బుధవారం అందజేశారు. ఈ అవార్డు రావడంపై ఎండీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో అందరికీ తాగు నీరు అందించడంతో పాటు.. ఉత్పన్నమయ్యే మురుగును శుద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాగోల్ 320 ఎమ్మెల్డిల ఎస్టీపీ పర్యావరణ అనుకూలత, సమర్థవంతమైన మురుగు నీటి శుద్ధి మరియు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విశేష ప్రాముఖ్యతను చూపినందుకు ఈ అవార్డుకు ఎంపికైంది. మురుగు శుద్ధి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడం, మరియు సమాజానికి పరిశుభ్రమైన.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. అలాగే అధునాతన నీటి నిర్వహణ, సర్క్యులార్ ఎకానమీ విధానాలు, మురుగు నీటి పునర్వినియోగం వంటి అంశాలలో చేసిన కృషికి ఈ గుర్తింపు లభించింది. నాగోల్ ఎస్టీపీ మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో పెద్ద ప్లాంట్ ప్రసిద్ధి చెందింది.చాదర్ ఘాట్ నుంచి ప్రారంభమయే మురుగు నీరు.. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ఎన్నో నాలలను కలుపుకుంటూ నాగోల్ వద్దకు చేరుకుంటుంది. ఇక్కడ నిర్మించిన ప్లాంట్ ద్వారా నిత్యం 320 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుద్ధి చేసి మూసీలోకి వదులుతున్నారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం మార్చ్ 31న డిల్లీలో జరిగింది. జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ I సుదర్శన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎస్టీపీ సీజీఎంలు పద్మజ, సుజాత, జీఎం కుమార్, డీజీఎం నిరుపమ మేనేజర్లు పాల్గొన్నారు.

## నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం నగర స్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశం



హైదరాబాద్, ఏప్రిల్ 02: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (NCAP) కింద నగర స్థాయిలో అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం GHMC ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశం జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి అధ్యక్షత జరిగింది. ఈ సమావేశంలో హైదరాబాద్ సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు, TGPCB, TGIIC, TGSRTC, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, HMRL, సివిల్ సప్లైస్, TG ట్రాన్స్‌పోర్ట్, GHMC అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు 15వ ఆర్థిక కమిషన్ నిధులను ఉపయోగించి వివిధ శాఖల ద్వారా చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక పై చర్చించి నిర్ణయాలు తిసుకున్నారు. 202425 ఆర్థిక సంవత్సరానికి హైదరాబాద్ నగరానికి రూ. 112.36 కోట్ల నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో వివిధ విభాగాలతో చర్చించిన అనంతరం ముఖ్యమైన సూచనలు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి మాట్లాడుతూ... అన్ని శాఖలు కలిసి పని చేసి, హైదరాబాద్ నగరానికి పరిశుభ్ర వాయువును అందించడానికి కృషి చేయాలని సూచించారు. తిసుకునే చర్యలు PM10 తగ్గింపు మరియు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మెరుగుపడేలా చేయాలన్నారు. TGPCB మరిన్ని ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. రహదారులను ధూళి రహితంగా ఉండేందుకు చేపట్టవలసిన చర్యలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు ముఖ్యంగా స్వీపింగ్ మిషన్స్ ద్వారా కాలుష్యం తగ్గించే అవకాశం ఉందనేది కూడా పరిశీలన చేయాలన్నారు వెహికల్స్ ద్వారా కాలుష్యాన్ని తగ్గించేందుకు చేపట్టవలసిన చర్యలు తీసుకోవాలని అందుకోసం పబ్లిక్ ట్రెన్స్పోర్ట్ సిస్టమ్ లో కూడా ఎలక్ట్రికల్ వాహనాలు వాడకం పెంచేందుకు చర్యకు తీసుకోవాలని అందుకు కోసం ఆర్థిక నిధులు మంజూరు చేయడం జరుగుతుందని , భవన నిర్మాణ రంగం లో కూడా కాలుష్యాన్ని నివారించేందుకు ఇప్పటి కే చర్యలు తీసుకున్నట్లు అవి అతిక్రమిస్తే. చర్యకు తీసుకునే విధంగా క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు కమిషనర్ వివరించారు. ఇంకా అధిక కాపుష్యాన్ని సృష్టించే పారా మీటర్ల ఎక్కువ గావున్న కొన్ని అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు ముఖ్యంగా ఇండస్ట్రీస్ హోటల్స్, రెస్టారెంట్స్, డొమెస్టిక్ అంశాల్లో పూర్తిగా నివారించేందుకు సంబంధిత అధికారులు తమ వంతు కృషి చేయాలని కమిషనర్ ఆయా శాఖ అధికారులకు తగు సూచనలతో పాటుగా ఆదేశాలు జారు చేసారు. సాయిల్ రోడ్డు డస్ట్ పైన ఎక్కువగా దృష్టి పెట్టవలసిన అవసరం ఏర్పడిందని ఆ దృష్టిలో జి హెచ్ ఎం సి చేయవలసిన అవసరమైన అంశాలతో కార్యాచరణ సిద్ధం చేయాలని కమిషనర్ శానిటేషన్ అధికారులు ఆదేశించారు భవిష్యత్ తరాల వారికి స్వేచ్ఛా మైన గాలి అందించాలంటే ప్రభుత్వం తో పాటుగా ప్రజలు కూడా సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. CNG అందించడంలో రాయితీ ఇచ్చి, బస్సుల నిర్వహణలో సహాయం చేస్తామని భాగ్యనగర్ గ్యాస్ నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ ట్రాఫిక్ పోలీస్ జోయల్ డేవిస్ మాట్లాడుతూ... కార్ పూలింగ్ను ప్రోత్సహించడం ద్వారా ట్రాఫిక్ తగ్గించడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ... మొత్తం 550 PUC వాహనాలలో 478 వాహనాలను ఆన్‌లైన్ సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం చేసి, పర్యావరణ అనుమతి సర్టిఫికెట్లను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అన్ని శాఖలు సమన్వయంతో అమలు చేయడం ద్వారా హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ లు రఘు ప్రసాద్, సుభద్ర దేవి, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డేవిస్, రాచకొండ ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసులు సి.ఈ లు భాస్కర్ రెడ్డి, కోటేశ్వరరావు, రత్నాకర్, సిసిపి శ్రీనివాస్, ట్రాన్స్ పోర్ట్ జాయింట్ కమిషనర్ సి.రమేష్, టి.జి. పి.సి.బి సీనియర్ సైంటిస్ట్ లు డా.డి. ప్రసాద్, ఎన్.జయశ్రీ, సికింద్రాబాద్ ఆర్డిఓ సాయి రాం, టి.జి.ఎస్.ఆర్.టి.సి డిప్యూటీ సి.ఎం.ఈ వి.శివ శంకర్, ఏ.ఎం.ఈ నాగ భూషణం ఇతర అధికారులు రామ్మోహన్, మనోహర్ కుమార్ రాథోడ్, శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు, మెట్రో రైలు, టి.జి.ఐ.ఐ.సి, ఇ.పి.టి.ఆర్.ఐ అధికారులు, ఎలక్ట్రికల్ ఈఈ లు, తదితరులు పాల్గొన్నారు.

## శిల్పా లే ఔట్ ఫ్లైఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**: సి.ఈ భాస్కర్ రెడ్డి**




హైదరాబాద్, ఏప్రిల్ 02: గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు నిర్మించిన శిల్పాలే ఔట్ ఫ్లైఓవర్ పనులను మే 15 వరకు పూర్తి చేయాలని ప్రాజెక్టు సి.ఈ భాస్కర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సి.ఈ ప్రాజెక్టు భాస్కర్ రెడ్డి, ఎస్ ఈ, ఈ ఈ, కన్సల్టెంట్ నిర్మాణం చేసే ఏజెన్సీ ప్రతినిధులతో కలిసి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సి.ఈ భాస్కర్ రెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులు సత్వరం పూర్తి చేయాలని, అంతేకాకుండా గచ్చిబౌలి నుండి కొండాపూర్ ఎడమ వైపు సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించారు. ఈ సర్వీస్ రోడ్డులో విద్యుత్ పరికరాలు తొలగించేందుకు స్థల సమస్య ఉన్న నేపథ్యంలో సర్వీస్ రోడ్డు చేపట్టలేక పోయినట్లు ఏజెన్సీ వివరించడంతో అక్కడే ఉన్న ప్రాజెక్టు ఈ ఈ తొందరగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్ట్రామ్ వాటర్ డ్రైన్ కు స్పష్టమైన స్థలం లేకపోవడంతో జాప్యానికి కారణమని అన్నారు. ఓల్డ్ బొంబాయ్ హైవే లో సమగ్ర జంక్షన్ అభివృద్ధికి అవసరమైన ఆస్తుల సేకరణ చేయాలని అధికారులను కోరారు. ఓ.ఆర్.ఆర్ స్ట్రెచ్ లో గ్రేడ్ రోడ్డు పి.ఎస్.ఓ మీడియన్ తదితర పనులు పరిశీలించి అధికారులకు ఏజెన్సీ కి తగు సూచనలు జారీ చేసారు. డిజైన్, ప్రమాణాల ప్రకారం విస్తరణ జాయింట్లను ఇన్స్టాల్ చేయాలని సూచించారు. మిగిలిన 3 డెక్ స్లాబ్ లను పి30, పి 31, పి 31 32 , పి 33 ఏ 2 పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డెక్ స్లాబ్ పై పి.ఎం.బి వేయడం వేగవంతం చేయడానికి సజావుగా రౌడింగ్ చేయడానికి ఉపరితలం బాగుండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్రాష్ బ్యారియర్ నిర్మాణాలు మీడియన్, గ్యాంట్రీల నిర్మాణం, సైన్ బోర్డ్ లు, పెయింటింగ్ తదితర పనులు ఎల్ గ్రీడ్ రోడ్లు, పి.ఎస్.ఐ ముగింపు పనులు వేగవంతంగా పూర్తి చేసి అన్ని పను లను మే 15 లోగా పూర్తి చేయాలని అధి కారులను ఆదేశించారు. సి ఈ వెంట డిప్యూటీ ఈ ఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులంతా క్షేత్రస్థాయిలో పని చేయాలి

- **ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలి**
- **పనుల విషయంలో జాప్యం వహిస్తే సహించేది లేదు :**
- **త్రాగు నీటి సమస్యలను పరిష్కరించాలి**
- **ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్:**

ఉట్నూర్, ఇంద్రవెల్లి ఏప్రిల్ 02 (సమయం న్యూస్) : ఉట్నూర్ : గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సి భవనంలో ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండల తహసీల్దార్, ఎంపిడిఓ, పంచాయతీ రాజ్ శాఖ, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలలో త్రాగునీటి, విద్యుత్, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ, నూతన రేషన్ కార్డులు, రోడ్లు పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలన్నారు. అర్హుడైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేయాలని, దళారుల హస్తం పకడ్బందిగా చర్యలు చేపట్టాలని అన్నారు. పలు చోట్ల ఇంటిపై విద్యుత్ తీగలు ఉన్నాయని, వాటిని తొలిగించి మరో చోటికి మార్చాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను సుందరంగా తీర్చదిద్దడానికి అభివృద్ధి పనులను చేపడుతోందని, పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, జాప్యం వహిస్తే సహించేది లేదనీ హెచ్చరించారు. ఫ్లోరైడ్ ఉన్న గ్రామాల్లో మంచి నీటిని అందించాలని సూచించారు. అన్ని గ్రామాల్లోని నీటిని సేకరించి తన వద్ద ఇవ్వాలని ఆ నీటిని పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలుగుతూ. విద్యుత్ ను పొదుపుగా వాడాలని అన్నారు. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తోందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల తహసిల్దార్, పంచాయతీ రాజ్ డిఈ, ఏఈ, మిషన్ భగీరథ డిఈ, ఏఈ, విద్యుత్ శాఖ డిఈ, ఏఈ, జేఈ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# బోధన్ సబ్ కలెక్టర్ , మున్సిపల్ కమిషనర్ ను కలిసిన కాలనీ వాసులు

బోధన్, మే 242సమయం : బోధన్ ఆచనపల్లి ప్రగడపల్లి రోడ్డులో గల కొత్తగా ఏర్పడిన కాలనీవాసులు ఈరోజు ఉదయం బోధన సబ్ కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్ను కలిసి తమ కొత్తగా ఏర్పాటు చేసుకున్న కాలనీకు పేరు పెట్టుకుంటా కి పర్మిషన్ కోసము కాలనీవాసులందరూ కలిసి కాలనీ కొత్త కమిటీ ని ఏర్పాటు చేసుకుని. పర్మిషన్ కోసం సబ్ కలెక్టర్,మున్సిపల్ కమిషనర్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత కొద్ది రోజుల క్రితం. కాలనీవాసులు అందరు కలిసి అయోధ్య కాలనీగా నామకరణ చేసి బోర్డులు ఏర్పాటు చేశారు . కానీ ఎవరో ఫిర్యాదు చేశారని సబ్ కలెక్టర్ మున్సిపల్ సిబ్బందికి ఆదేశించి పోలీసు వారి సహాయంతో అర్ధరాత్రి రెండు గంటలకు దొంగతనంగా బోర్డులను తీసుకెళ్లారు. ఈ విషయంలో కాలనీ వాసులు సబ్ కలెక్టర్ ను



కలవగా కలవగా. పర్మిషన్ లేదు కాబట్టి తీసివేస్తామని తెలిపారు. ఈ విషయంపై కాలనీవాసులు ఒక సంఘం ఏర్పడి. కమిటీని ఏర్పాటు చేసుకుని. సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అయోధ్య కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సుధాకర్ , కార్యదర్శి దండు పిరయ్య, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, ప్రధాన సలహాదారుడు చాప రాల రాజశేఖర్, మరియు కాలనీ పెద్ద లందరూ పాల్గొన్నారు.



# ప్యారా నగర్ డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా 57వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

సమయం న్యూస్, గుమ్మడిదల : గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ ప్యారా నగర్ లో డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 57వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మడిదలలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలో బొంతపల్లి, వీరన్న గూడెం అఖిలపక్షం నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాలలో నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ పచ్చని అడవిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి రైతుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని నాయకులు మండిపడ్డారు. ముక్త కంఠంతో డంప్ యార్డు వద్దంటూ 57 రోజులుగా వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ లు నరసింహారెడ్డి, సురభి నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నబోయిన వేణు, తులసీదాస్, దోమడుగు బాల్ రెడ్డి, వినోద్, రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్, బిక్ష పతి, హమాలి యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# గెలుపోటములు క్రీడా స్ఫూర్తి తో తీసుకోవాలి

## : బ్యాడ్మింటన్ మాజీ ఇంటర్నేషనల్ కోచ్ భాస్కర్ బాబు

క్రీడా ప్రతినిధి : క్రీడాకారులు గెలుపు ఓటములు క్రీడా స్ఫూర్తితో తీసుకున్నప్పుడే క్రీడల్లో రాణిస్తారని మాజీ ఇంటర్నేషనల్ బ్యాట్మెంటన్ కోచ్ భాస్కర్ బాబు పేర్కొన్నారు. అకాడమీ నిర్వాహకులు పిల్లలమర్రి రమేష్, రఘు ఆధ్వర్యంలో బుధవారం నాగోల్ లోని భాస్కర్ బాబు ఆర్ త్రి బ్యాడ్మింటన్ అకాడమీ ని భాస్కర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా తీసుకున్నప్పుడే వారు మరింతగా క్రీడల్లో రాణిస్తారని అన్నారు. అలాగే క్రీడలతో పాటు చదువులో రాణించినప్పుడు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ఈ కంప్యూటర్ యుగంలో తల్లిదండ్రులు తమ పిల్లలని సెల్ఫోన్లకు అంకితం కాకుండా క్రీడా మైదానానికి ఉదయం, సాయంత్రం పంపుతూ ఇష్టమైన క్రీడల్లో తప్పనిసరి పాల్గొనేలా చూస్తూ తమ పిల్లలు ఆరోగ్యవంతులుగా రాణిస్తారని తెలిపారు. అనంతరం అర్చకులు క్రీడా కారులకు ఆశీర్వచనం చేశారు. క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

# పోలీసు కళాబృందంచే ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు కార్యక్రమం

* **రాయపోల్ ఏప్రిల్ 02 : బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్కల్ గ్రామంలో మంగళవారం రాత్రి**

నిర్వహించారు.ఈ సందర్భంగా బేగంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి, ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రాలు తంత్రాలు అంటూ మూఢనమ్మకాలు నమ్మవద్దని,మూఢనమ్మకాలు నమ్మి ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. ఏదైనా అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవాలని, ఈ రోజుల్లో ఆసుపత్రులలో ఆధునిక వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. లేనిపోని మూఢనమ్మకాలతో ఒకరిపై ఒకరు కక్షలు పెంచుకొని కొట్టుకోవడం మంచి పద్ధతి కాదన్నారు, ఏదైనా సమస్య ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ కు రావాలని ఇరు వర్గాలను పిలిపించి



కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి గ్రామ ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు సీసీ కెమెరాలు 24 గంటలపాటు ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీని ఇస్తాయని తెలిపారు. ఆశ, భయము, మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి, బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు, అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ డీటెయిల్స్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడవేయవద్దు చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దు ఉన్న కుటుంబ సభ్యులను దుఃఖసాగములో ముంచవద్దు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంట్లో ఉన్న యువకులు, పిల్లలపై ఒక కన్నేసి ఉంచాలి, ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారు, ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారు గమనిస్తూ ఉండాలి మూఢనమ్మకాలు, చేతబడులు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుక్మతల గురించి సిద్ధిపేట పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, ప్రసాద్, ప్రకాష్, బిక్షపతి, నాటకం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ప్రజాప్రతినిధులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ ఇన్చార్జ్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన చీలశంకర్

బోధన్, 2 ఏప్రిల్, బుధవారం, (సమయం) : బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్చార్జి చైర్మన్ గా చీలశంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలం క్రితం అంకు సంధ్యా దామోదర్ రెడ్డి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా ఉండగా తనకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగము రావడంతో చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. చైర్మన్ పదవి ఖాళీగా ఉండడంతో వైస్ చైర్మన్ గా వ్యవహరిస్తున్న చీలశంకర్ కు ఇంచార్జ్ చైర్మన్ గా బాధ్యతలను అప్పగిస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చీలశంకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి



ఈ బాధ్యతలను అప్పగించినందుకు శాసనసభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి, మార్కెటింగ్ శాఖ వారికి, కమిటీ సభ్యులకు, నాయకులకు, రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ శాఖకు సంబంధించిన విషయాలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉంటానని అన్నారు. అనంతరం వేసవికాలం కావడంతో మార్కెట్ కమిటీకి ధాన్యం తరలించే రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఉచిత అన్నవితరణ కార్యక్రమంను ప్రముఖుల ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగిందనీ, ఈ సీజన్ వరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి డెలికేట్ గంగాశంకర్, నాయకులు అంకు దామోదర్ రెడ్డి, నాగేశ్వరరావు, నరేందర్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినుద్దీన్, మార్కెట్ పాలక కమిటీ సభ్యులు, అధికారులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీ సాఫీగా జరగాలి

* **రేషన్ షాప్ లలో సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదు , కలెక్టర్ రాహుల్ రాజ్**
* **సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిన కలెక్టర్**

నర్సాపూర్ ఏప్రిల్ 2 , (సమయం న్యూస్) : తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టింది దానిలో భాగంగా బుధవారం నర్సాపూర్ పట్టణం లో 15వ వార్డ్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్వయంగా సన్న బియ్యం పంపిణీ చేశారు.రేషన్ దుకాణానికి కేటాయించబడిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించి కోటా కు అనుగుణంగా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేసి, దానికి అనుగుణంగా బియ్యం స్టాక్ నిలువలు తెలుసుకున్నారు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు.ఏ ఒక్క దుకాణంలోనూ సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదని అన్నారు. జిల్లాలో 2,13,820 మంది రేషన్ కార్డులు కలిగిన వారు ఉన్నారు వారికి ప్రతీ నెల 4430.496 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి జాప్యానికి తావు లేకుండా లబ్దిదారులకు సకాలంలో



సన్న బియ్యం పంపిణీ జరిగేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేసి అండగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ ర్డి ఓ మహిపాల్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

- **ఇందుప్రియాల్ రామాలయంలో జరుగనున్న ఉత్సవాలు**
- **బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి**





దౌల్తాబాద్, ఏప్రిల్ , సమయం న్యూస్ 02 : దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో ప్రతి సంవత్సరం జరుగనున్న శ్రీ సీతా రామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 03 నుండి 11 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 03న సుప్రభాత సేవ, భగవతారాధన, ఆరాధన, అధ్యయనోత్సవం, సేవాకాలము ఆరంభం. 4న సుప్రభాతం, భగవతారాధన, ప్రధానంద పారా యణం, పరమపడోత్సవం, అర్థగోష్టి, వాసుదేవ పురాణ్యహవాచనం, అఖండదీపారాధన, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకరార్పణం, నాంది ఇడహవాచనం, బ్రహ్మకలనస్మాపన, ఆరగింపు, అర్థ గోష్టి. 5న బాల భోగం, దేవతాహ్వనం, ద్వజారోహణం, అగ్ని ప్రరోష్ట హోమం, బలిహరణం, విష్ణు సహస్రనామ పారాయణం, నిళ్ల శ్రమము. 6న స్వామి వారి అభిషేకం, ఎదుర్కోలు అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త అన్నారెడ్డి సుభాష్ రెడ్డి తెలిపారు. అదే రోజు సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, నిత్య హోమం. 7న భగవణగిన నిత్య హోమం, బలిహరణం, పొన్నంగి సేవ. 8న విష్ణుం సంప్ర వారు పారాయణం, బేరి పూజ, నిత్య హోమం, హనుమంత సేవ. 9న గరుడ సేవ, విష్ణు సంప్రనామ పారాయణం, నిత్యహోమం, బలిహరణం. 10న భగవ తారాధన, రథహోమం, రథోత్సవం, అట్ల గోవ. 11న శ్రీ పుష్పయాగం, ఉద్యాసనములు, సప్త వర్ణ ఏకాంత సేవ, తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతిఏటా జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఇందుప్రియాల్ తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

* **బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**ఆలయ ధర్మకర్త అన్నా రెడ్డి గారి సుభాష్ రెడ్డి**

నేటి నుంచి 11వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. 6న జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బం దులు కలగకుండా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.




# కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఉచిత సన్న బియ్యం పంపిణీ

సమయం న్యూస్, జిన్నారం: కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఉచిత సన్న బియ్యం పథకాన్ని చేపట్టిందని బీజేపీ నాయకులు అన్నారు. జిన్నారం మండలంలోని అండూరు, ఖాజీపల్లి గ్రామాల్లో బుధవారం ఉచిత సన్న బియ్యం పథకాన్ని చౌక ధరల దుకాణాలలో బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ సీనియర్ నాయకులు కురుపల్లి నర్సింగరావు ,సీ వెంకటేష్, బోయిని నరసింహ, కొండరాజు, మన్నె సతీష్ కుమార్, చిరుమని ఆంజనేయులు, ఆకుల రాము, భాను, చిరుమని సాయిలు, కిరణ్, కుమ్మరి రాజు, ఆగమయ్య, మల్లెల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి

* గురువారం నాడు జరిగే మహాత్మా గాంధీ డాక్టర్ అంబేద్కర్ గారి ఆశయాలు రాజ్యాంగ పరిరక్షణ
* చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది*
* ఇట్టి కార్యక్రమాన్ని
* కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు*



వెల్దుర్తి ఏప్రిల్ 2 సమయం న్యూస్: మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ శ్రీ దేవి భూదేవి శ్రీ వెంకటేశ్వర స్వామి శివపార్వతుల 40 వ వార్షిక మహోత్సవ కార్యక్రమానికి హాజరైన మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజి రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర దేవాలయాన్ని నిర్మించి 40 సంవత్సరాలు గడుస్తున్నటువంటి తరుణంలో ప్రతి సంవత్సరం శ్రీ వెంకటేశ్వర కళ్యాణం జరపడం ఎంతో ఆనందమని,శ్రీ వెంకటేశ్వర స్వామి నీ దర్శించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఇలాంటి కల్యాణ మహోత్సవాలు ఎన్నో జరుపుకోవాలని ఆయన తెలియజేశారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 3 గురువారం నాడు వెల్దుర్తి మండల కేంద్రంలోని జై బాబు జై భీమ్ జై సంవిధాన్ మహాత్మా గాంధీ డాక్టర్ అంబేద్కర్ గారి ఆశయాలు రాజ్యాంగ పరిరక్షణ పేరిట చైతన్య కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా దేశ రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేస్తుందని మహాత్మా గాంధీ, డాక్టర్ అంబేద్కర్, సిద్ధాంతాలను అనుసరించి సమాజ సేవలో ముందున్నారని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలకు సేవ చేసే మార్గంలో నడవాలని అన్నారు ఏప్రిల్ 3 గురువారం నాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఉదయం ఎనిమిది గంటల వరకు వెల్దుర్తి మండలానికి చేరుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమన్న గారి నరేందర్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, వెల్దుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి వెల్దుర్తి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, ఫిషర్మెన్ కార్యదర్శి తలారి మల్లేశం, జగ్గా శంకర్ గౌడ్, సొసైటీ డైరెక్టర్ కిష్టగౌడ్, నాల చెరువు శేఖ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్మి రీ శెట్టి నంబూద్రి గుప్తా, కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్త కొత్త ముక్తాబాయి, అయ్యప్ప గారి శ్రీనివాస్, జగ్గ అశోక్, పాల్గొన్నారు.



# నర్సాపూర్ లో గంజాయి విక్రయం

* నిఘా వేసి పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

నర్సాపూర్ ఏప్రిల్ 2, (సమయం న్యూస్): నర్సాపూర్ పట్టణంలో గంజాయి విక్రయం జరుగుతుందన్న సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ అధికారులు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మెదక్ జిల్లా అధికారి D.P.E.O G.శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం D.T.F MEDAK C.I గోపాల్ తమ సిబ్బందితో బుధవారం నర్సాపూర్ పట్టణంలో గంజాయి విక్రయాలు చేసే వ్యక్తుల పైన నిఘా ఏర్పాటు చేయగా జగన్నాథరావు కాలనీలో నివాసం ఉంటున్న వి వెంకటేష్ వయసు 39 అనే వ్యక్తిని ఇంటి నందు తనిఖీలు చేయగా 310 గ్రాములు గంజాయి లభించింది. వ్యక్తిని అదుపులోకి తీసుకొని N.D.P.S ACt ప్రకారం కేసు చేయడం జరిగింది విచారణ నిమిత్తం S.H.O నర్సాపూర్ అప్పగించడం జరిగింది మెదక్ జిల్లా టాస్కోర్స్ C.I గోపాల్ మాట్లాడుతూ గంజాయి విక్రయాలు మరియు రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గంజాయి,మత్తు పదార్థాలు కలిగి ఉన్న వ్యక్తుల యొక్క సమాచారం తమకు ఇవ్వవలసిందిగా కోరారు అట్టి వ్యక్తుల యొక్క సమాచారాన్ని గోప్యంగా ఉంచి గంజాయి రవాణా చేసే వ్యక్తుల పైన కేసులు నమోదు చేస్తామని తెలిపినారు ఈ దాడులలో SI.బాలయ్య హెడ్ కానిస్టేబులు చంద్రయ్యా, ఎల్లయ్య, కానిస్టేబుల్ రాజు, రవి, నవీన్, నరేష్ పాల్గొన్నారు

# అంబర్ పేట లో ఇంటి బాల్కనీ స్లాబ్ కూలీ తప్పిన ప్రమాదం

అంబర్ పేట, ఏప్రిల్, 2, సమయం న్యూస్: అంబర్ పేట నియోజకవర్గం, గోల్నాక డివిజన్, సంజయ్ గాంధీ నగర్ లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ నిర్మించిన ఈ ఇళ్లను 30 ఏళ్ల క్రితమే కన్స్ట్రక్షన్ చేయడం జరిగింది.ఇప్పుడు ఈ బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకుంది. ఈరోజు ఈ బిల్డింగు మెట్ల, బాల్కని కూలిపోయి పక్కనే ఉన్న రేకుల ఇంటి పైన పడింది, మెట్ల మీద దిగుతున్నటువంటి అబ్బాయికి చేతులు కొద్దిగా ఫ్యాచర్ కావడం జరిగింది, అదృష్టవశాత్తూ ఎవరికి ఏమి కాలేదు. బిల్డింగ్ స్లాబ్ ఎక్కడికి అక్కడ ఊడి కింద పడటంతో భయాందోళనకు గురవుతున్న స్థానిక ప్రజలు, స్లాపు కూలిపడటంతో స్థానికుల సమాచారం మేరకు సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను పరివేక్షించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు దూసరి శ్రీనివాస్ గౌడ్ గారు, బిజెపి సీనియర్ నాయకులు రమేష్ యాదవ్ గారు అక్కడికి చేరుకొని అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగింది, వెంటనే అక్కడికి వచ్చిన జిహెచ్ఎంసి అధికారులు, ప్లానింగ్ అధికారులు ఏసిపి దేవేందర్, కిష్టయ్య, ఎమ్మార్వో గారు పరిశీలించారు. దూసరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ప్రజలకు ఇక్కడే ప్రభుత్వము మరియు ముఖ్యమంత్రి గారు కొత్తగా ఇల్లు నిర్మించి



ఇవ్వాలి, ఇల్లులు కట్టేంతవరకు వారికి ఆర్థికంగా సాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు.

# బి వి ఆర్ ఐ టి కళాశాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పరిశోధన ప్రదర్శన

నర్సాపూర్, ఏప్రిల్ 2, (సమయం న్యూస్) : BVRIT కళాశాల యొక్క పరిశోధన మరియు అభివృద్ధి సెల్ “సుస్థిర అభివృద్ధి లక్ష్యాల వైపు” అనే అంశంపై దృష్టి సారించి R&D ప్రదర్శన 2025 యొక్క 3వ ఎడిషన్‌ను బి వి ఆర్ ఐ టి కాలేజ్ లో నిర్వహించారు ఈ కార్యక్రమంలో 14 విభాగాల నుండి సుమారు 500 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ప్రాజెక్టులు ఆవిష్కరణ మరియు విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మించడంలో సామాజిక పురోగతికి దోహద పడటంలో విద్యా పరిశోధన యొక్క ప్రాముఖ్యతను IICT, హైదరాబాద్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్. శ్రీధర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు మరియు అధ్యాపకుల లో ప్రభావవంతమైన పరిశోధనలను పెంపొందించడంలో సంస్థ యొక్క నిబద్ధతను BVRIT డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మీ ప్రసాద్ హైలైట్ చేశారు. BVRIT ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే సంస్థ యొక్క పరిశోధన విజయాలను మరియు దాని అత్యాధునిక ఆవిష్కరణ సంస్కృతిని వివరించారు. బలమైన పరిశోధనా సంస్కృతిని నిర్మించడానికి జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థలతో కొనసాగుతున్న సహకారాన్ని SVES R&D డీన్ డాక్టర్ రాజు ఏడ్ల చర్చించారు. స్పాన్సర్డ్ రీసెర్చ్ డీన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ విద్యార్థులు తమ పరిశోధన ప్రయత్నాలను మరింతగా పెంచుకోవాలని కోరారు. హెచ్ఓడీలు మరియు డీన్‌లు ఈ ప్రదర్శనలో



పాల్గొన్నారు.BVRIT నర్సాపూర్ లో బలమైన పరిశోధనా పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో నిరంతర మద్దతు ఇచ్చినందుకు నాయకత్వ బృందంయాజమాన్యానికి చైర్మన్ కె.వి. విష్ణు రాజు వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ ఆదిత్య విస్సం మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాపి రాజు కృతజ్ఞతలు తెలిపారు.



# రాయపోల్‌లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన అధికారులు

* రయాపోల్ మండల కేంద్రం లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిన స్పెషల్ ఆఫీసర్ బాబు నాయక్ గారు మరియు తహశీల్దార్ శ్రీనివాస్

రాయపోల్, మార్చి సమయం న్యూస్ 2 ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం బుధవారం రాయపోల్ మండల స్పెషల్ ఆఫీసర్ బాబూనాయక్, తహసీల్దార్ శ్రీనివాస్ ప్రారంభించారు. లబ్దిదారులు విధిగా సన్న బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. గిర్దావర్ భానుప్రకాష్‌రావు, సీనియర్ నాయకులు కిష్టారెడ్డి, డీలర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాపై కళాశాల విద్యార్థులకు అవగాహన

హన్మకొండ ఏప్రిల్ 02(సమయం న్యూస్) : మానవ అక్రమ రవాణాపై యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, పోలీస్ కళా బృందం, సుబేదారి పోలీసుల ఆధ్వర్యంలో న్యూసైన్స్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారులతో ఎలాంటి పనులు చేయించుకోవద్దన్నారు. నవజాత శిశువులను అక్రమంగా దత్తత తీసుకోవడం నేరమని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే డయల్ 100 లేదా చైల్డ్ హెల్ప్ న్కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సుబేదారి ఇన్స్ స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఏ. హెచ్. టి. యూ ఇఇన్స్ స్పెక్టర్ వెంకన్న తో పాటు ఎస్.ఐలు, జాగృతి కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి : నగర మేయర్

* ఇంజనీరింగ్ అధికారులతో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష....

వరంగల్ కార్పొరేషన్ ఏప్రిల్02( సమయం న్యూస్) : అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లో మేయర్ పాల్గొని డివిజన్ల వారిగా అధికారులతో పనుల పురోగతి సమీక్షించి సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ నగర పరిధి లో వివిధ పథకాల కింద చేపట్టబడి కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులలో పురోగతి అవసరం అని నిర్దేశిత గడువులో సంబంధిత పనులు పూర్తి చేసేలా చూడాలని, కార్పొరేటర్లకు కేటాయించిన పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అంతేకాకుండా పనులలో



నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు ఎప్పటికపుడు ఫీల్డ్ లో పర్యవేక్షించి పూర్తి చేసేలా చూడాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టి లో ఉంచుకొని నీటి ఎద్దడి లేకుండా ముందస్తు వ్యూహం తో ప్రణాళికా బద్దం గా వ్యవహరిస్తూ నీటి సరఫరా చేయాలని ప్రధానం గా లీకేజీ లు అరికట్టడం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నీటి సరఫరా జరగని ప్రాంతాల్లో ట్యాంకర్ ల ద్వారా నీటి సరఫరా చేయాలని మేయర్ అన్నారు. బల్దియా వ్యాప్తంగా వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ లు రవికుమార్ మహేందర్ సంతోష్ బాబు మాధవి లత డి ఈ లు సారంగం రోజా రాణి కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# MOVIE TIME





## అలియా భట్‌తో పోల్చకండి ప్లీజ్..

### నటి షాలినీ పాండే వెల్లడి

టాకీస్: బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.





## చిరంజీవితో నాని సినిమా

### అంచనాలను పెంచిన ప్రకటన

**టాకీస్:** నేచురల్ స్టార్ నాని ఇప్పుడు హీరోగా కన్నా నిర్మాతగానే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కారణం ఆయన చేసే ప్రతి సినిమా కూడా సూపర్ హిట్ అవుతుంది. రీసెంట్‌గా కోర్ట్ అనే సినిమాతో పెద్ద విజయం సాధించారు. ఈ క్రమంలో నాని అంటే మంచి సినిమాలు చేస్తాడని ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు, కూడా ఫిక్స్ అయ్యారు. ప్రస్తుతం నాని శైలేష్ కొలను దర్శకత్వంలో సొంత బ్యానర్ లో హిట్3 సినిమా చేస్తున్నాడు. అలానే ది ప్యారడైజ్ అనే చిత్రంలోను నటిస్తున్నాడు. అయితే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని తన ఫ్యూచర్ ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించాడు.

త్వరలో దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి ఓ ప్రాజెక్ట్ చేయనుండగా, దీనికి నాని సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు బాగా ఉన్నాయి. అందుకు కారణం ఈసారి మళ్లీ రక్తం పారాల్సిందే అంటూ శ్రీకాంత్ చాలా వయెలెంట్ సినిమా చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీని గురించి తాజా ఇంటర్వ్యూలో నాని మాట్లాడుతూ.. చిరంజీవి గారు అనగానే డ్యాన్స్, యాక్షన్ అని మనం ఒక అభిప్రాయానికి వచ్చేశాం..కానీ ఆయన అంతుకుమించి.. చిరంజీవి కేవలం అది మాత్రమే కాదు.. ఆయన్ని ప్రతి ఫ్యామిలీలో ఒక మెంబర్‌గా భావిస్తాం.. కానీ ఆ విషయాన్ని మనం మర్చిపోయి వేరే దేనిపైన ఫోకస్ చేస్తున్నాం. ఇప్పుడు శ్రీకాంత్ మ్యాడ్‌నెస్‌ని చిరంజీవి గారి సినిమా అంటే అది చాలా సూపర్ కాంబో.. అసలు నా లైఫ్‌లో చిరంజీవి గారి లాంటి స్థాయి వ్యక్తిని పెట్టి నేను ఓ సినిమా తీస్తానని ఎప్పుడూ ఊహించలేదు.. కానీ అనుకోకుండా ఇది కుదిరింది.. ఇది గొప్ప బాధ్యతగా భావిస్తున్నా.. ఖచ్చితంగా ది బెస్ట్ ఇస్తాం అంటూ నాని కామెంట్స్ చేశారు. ప్రస్తుతం నాని చేసిన కామెంట్స్‌తో మూవీపై అంచనాలు అమాంతం పెరిగాయి. నాని, చిరంజీవికి ఈ ప్రాజెక్ట్ మెమోరబుల్‌గా ఉండడం ఖాయమని అంటున్నారు.. ఈ వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

## రెండో సినిమా ప్రకటించిన నీహారిక

### సంగీత్ శోభన్‌తో తదుపరి చిత్రానికి రెడీ

టాకీస్: మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల తనయ నిహారిక యాంకర్‌గా, హీరోయిన్‌గా,నిర్మాతగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతుంది. హీరోయిన్‌గా నిహారిక చేసిన సినిమా ఒక్కటి హిట్ కాలేదు. దాంతో నిర్మాత అవతారం ఎత్తింది. నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు సినిమా సంచలన విజయం సాధించింది. ముందుగా హీరోయిన్ గా, తర్వాత వెబ్ సిరీస్ ల్లో నటించిందికానీ చివరకు నిర్మాతగా స్థిరపడింది. నిహారిక ఇటీవలే చిరంజీవి విశ్వంభర చిత్రంలోని ఓ పాటలో షూటింగ్ లో పాల్గొంది. ఈ పాటలో సాయిధరమ్ తేజ్ కూడా పాల్గొన్నారు. నటిగా మంచి మార్కులు దక్కించుకోలేకపోయిన నిహారిక నిర్మాతగా సత్తా చాటుతుంది. కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ- కుర్రోళ్లు చిత్రం 50 కోట్ల వసూళ్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమాతో పలకరించబోతుంది. తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో ఫుల్ ఫామ్ లో ఉన్న నటుడు సంగీత్ శోభన్ హీరోగా నటించబోతున్నాడు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలతో పాటు- ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, 3 రోజెస్.. పలు సిరీస్ లతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న సంగీత్ ఇందులో మెయిన్ లీడ్ పోషించబోతున్నాడు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు గతంలో నిహారికతో కలిసి పని చేశారు. నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగం అయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా పని చేశారు. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో సంగత్ శోభన్ ప్రధాన పాత్ర పోషించారు. ఇక సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి మానస శర్మ దర్శకురాలిగా పని చేశారు. గతంలో ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు చేయగా, ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు.

ఈ ప్రాజెక్ట్‌కి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు.

మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.



## అద్భుత చిత్రరాజ్యం..ఆదిత్య 369

### అప్పట్లో ఆదిత్య-369 అద్భుత విజయం సాధించింది

### అంతేకాదు మంచి సినిమాగా నిలిచింది

**టాకీస్:** దర్శకుడు సింగీతం ఖాతాలో హిట్ పడింది. ఆయన ప్రతిభన్ మరోమరాఉ చాటింది. ఈ సినిమా గురించి ... ఇదేం నేపథ్యంఅని అప్పట్లో చాలామంది సందేహించారు. సినిమా విడుదలై, ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు 34 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ సినిమా అధునాతన సాంకేతిక విలువలతో ఈ నెల 4న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నాటి విశేషాలు పంచుకున్నారు. హాలీవుడ్ మూవీ 'బ్యాక్ టు- ది ఫ్యూచర్' స్ఫూర్తితో 'ఆదిత్య 369' తీశానని అనడాన్ని తిప్పికొట్టారు. ది టైమ్ మిషన్' నవలను తాను




కాలేజీ రోజుల్లోనే చదివానని, అందులోని ఆసక్తికర అంశాల గురించి స్నేహితులతో చర్చించేవాడిని. డైరెక్టర్‌ని అయిన తర్వాత ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఓ సారి విమాన ప్రయాణం చేస్తుండగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో నా ఆలోచన చెప్పా. ఎంతో ఉత్సాహం చూపిన ఆయన 'ఐడియా బాగుంది. తప్పకుండా చేద్దాం' అని అన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రముఖ నిర్మాతలకు ఆయనే ఈ కథ వినిపించారు. కానీ, వారికి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్ అర్థం కాలేదు. ఇదేదో ఫాంటసీ సినిమా అనుకున్నారు. కథపై నమ్మకం ఉన్న ఎస్పీబీ పట్టు వదలకుండా.. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌ను సంప్రదించారు. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. హీరో పాత్రకు ముందు నుంచీ బాలకృష్ణనే అనుకున్నాం. స్టోరీ విన్న వెంటనే ఆయన నటించేందుకు అంగీకరించారు.

## బాలీవుడ్ బడా హీరోతో సినిమా..

### పవన్ కళ్యాణ్ ప్రాజెక్ట్ అటకెక్కినట్టేనా?



**టాకీస్:** టాలీవుడ్ టాప్ డైరెక్టర్స్‌లో హరీష్ శంకర్ ఒకరు. ఆయన గబ్బర్ సింగ్‌తో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే ఈ సినిమా తర్వాత మళ్లీ హరీష్ శంకర్‌కి ఆ రేంజ్‌లో హిట్ పడలేదు. డిజాస్టర్ ఫేజ్‌లో ఉన్నాడు. ప్రస్తుతం హరీష్ శంకర్ నాలుగైదు సినిమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. వాటిలో బాలీవుడ్ హీరోతో సినిమా కూడా ఒకటి ఉన్నట్టు తెలుస్తుంది. గత ఏడాది రిలీజ్ అయిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో హరీష్ శంకర్ భారీ ఫ్లాప్ మూటగట్టుకున్నాడు. 'రైడ్' అనే హిందీ సినిమాకు రీమేక్ గా రూపొందిన ఈ సినిమా కనీసం యావరేజ్ టాక్ కూడా తెచ్చుకోలేకపోయింది. పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం చేసి మంచి హిట్ కొడతాడా అని అందరు అనుకున్నారు. కాని ఈ సినిమా ఇప్పటికీ సెట్స్ మీదకు వెళ్లలేదు. ఇక హరీష్ శంకర్ ఏ హీరోతో సినిమా చేస్తాడు అంటే రోజుకొక హీరో పేరు వినిపిస్తుంది. ఇటీవల ఆయన సల్మాన్ ఖాన్ కి ఓ కథ చెప్పాడని, హరీష్ శంకర్ నేరేషన్ కి ఫిదా అయిన కండల వీరుడు వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతుంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ మూవీని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనుందని, త్వరలోనే ఈ కాంబోకి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్ రానుందని చెబుతున్నారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.